20-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - కళ్యాణకారీ తండ్రి యొక్క పిల్లలైన మీ కర్తవ్యము - సర్వుల కళ్యాణము చేయడము, అందరికీ తండ్రి స్మృతిని ఇప్పించడము మరియు జ్ఞానాన్ని దానము చేయడము"

ప్రశ్న:- బాబా మహారథులు అని ఏ పిల్లలను అంటారు, వారి గుర్తులు ఏమిటి?

జవాబు:- ఎవరైతే బాగా చదువుతారో మరియు చదివిస్తారో, ఎవరిపైనైతే సదా బృహస్పతి దశ ఉంటుందో, ఎవరైతే తమ మరియు సర్వుల ఉన్నతి గురించి సదా ఆలోచన పెట్టుకుంటారో, ఎవరైతే యజ్ఞ సేవలో ఎముకలను ఇస్తారో, ఎవరైతే బాబా కార్యములో సహాయకులుగా ఉంటారో - వారు మహారథులు. ఇటువంటి మహారథి పిల్లలను బాబా - వీరు నా సుపుత్రులైన పిల్లలు అని అంటారు.

ఓం శాంతి. ఈ మధ్య పిల్లలు శివజయంతి కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కార్డులు మొదలైనవి కూడా ముద్రిస్తారు. తండ్రి అయితే ఎన్నో సార్లు అర్థం చేయించారు. మొత్తం ముఖ్యమైన విషయం అంతా గీత పైనే ఆధారపడి ఉంది. మనుష్యుల ద్వారా తయారుచేయబడిన గీతను చదువుతూ, చదువుతూ అర్ధకల్పం కిందకు దిగుతూ వచ్చారు. అర్ధకల్పం పగలు, అర్ధకల్పం రాత్రి అని కూడా పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు బాబా ఒక టాపిక్ ను (అంశమును) ఇస్తారు, దానిపై మంథనము చేయవలసి ఉంటుంది. మీరు ఇలా వ్రాయవచ్చు - సోదరీ సోదరులారా, మీరు వచ్చి అర్థం చేసుకోండి, ఒక్క గీతా శాస్త్రమే జ్ఞానానికి సంబంధించినది, మిగిలిన శాస్త్రాలన్నీ భక్తికి సంబంధించినవి. జ్ఞాన శాస్త్రము ఒక్కటే, దానిని పురుషోత్తమ సంగమయుగములో అనంతమైన తండ్రియైన పరమపిత పరమాత్మ త్రిమూర్తి శివుడు వినిపిస్తారు లేదా బ్రహ్మ ద్వారా వినిపిస్తున్నారు అని వ్రాయాలి, దాని ద్వారా 21 జన్మల సద్గతి లభిస్తుంది. జ్ఞాన గీత ద్వారా 21 జన్మల వారసత్వము లభిస్తుంది, తర్వాత 63 జన్మలు భక్తి యొక్క గీత నడుస్తుంది, అది మనుష్యుల ద్వారా తయారుచేయబడినది. తండ్రి రాజయోగాన్ని నేర్పించి సద్గతిని ఇస్తారు. ఇక తర్వాత ఏమీ వినవలసిన అవసరం ఉండదు, ఈ జ్ఞాన గీత ద్వారా పగలు వస్తుంది. దీనిని జ్ఞానసాగరుడైన తండ్రే వినిపిస్తారు, దీని ద్వారా 21 జన్మలు గతి, సద్గతి లభిస్తాయి అనగా 100 శాతం పవిత్రత, సుఖశాంతుల స్థిరమైన, అఖండమైన సత్యయుగ దైవీ స్వరాజ్యం లభిస్తుంది. 21 జన్మల కొరకు పైకి ఎక్కే కళ ఏర్పడుతుంది. మనుష్యుల ద్వారా తయారుచేయబడిన గీతతో కిందకు దిగే కళ ఏర్పడుతుంది. భక్తి యొక్క గీత మరియు జ్ఞానం యొక్క గీతపై బాగా విచార సాగర మంథనము చేయాలి. ఇదే ముఖ్యమైన విషయము, దీని గురించి మనుష్యులకు తెలియదు. మీరు ఇలా వ్రాస్తారు - త్రిమూర్తి శివజయంతియే శ్రీమత్ భగవత్ గీతా జయంతి, తద్వారానే సర్వుల సద్గతి భవంతి. శివ జయంతి ద్వారానే విశ్వములో శాంతి భవంతి అని కూడా వినిపించవచ్చు. ఈ ముఖ్యమైన పదాలు ఎంతో అవసరము, వీటిపైనే అంతా ఆధారపడి ఉంది. మనుష్యులు మనుష్యుల సద్గతిని చేయలేరని మీరు అందరికీ చెప్పవచ్చు. భగవంతుడు పురుషోత్తమ సంగమయుగములో సద్గతిని ఇవ్వడానికి వస్తారు, అది ఇప్పుడు జరుగుతోంది. ఈ 2-3 పాయింట్లు ముఖ్యమైనవి. శివుడు మరియు కృష్ణుని యొక్క గీతల మధ్యన భేదము అయితే ఉండనే ఉంది. త్రిమూర్తి శివ భగవానుడి ద్వారా సంగమములో గీతను వినడం ద్వారా సద్గతి లభిస్తుంది. ఇటువంటి పాయింట్లపై ఎవరైనా విచార సాగర మంథనము చేస్తే అప్పుడు ఇతరులపై కూడా ప్రభావము పడుతుంది. మనుష్యులు మనుష్యుల సద్గతిని ఎప్పుడూ చేయలేరు. కేవలం ఒక్క త్రిమూర్తి పరమపిత పరమాత్మ శివుడు, ఎవరైతే టీచరుగా కూడా ఉన్నారో, సద్గురువుగా కూడా ఉన్నారో, వారే ఈ పురుషోత్తమ సంగమయుగములో సర్వుల సద్గతిని చేస్తున్నారు. కార్డులో కొద్దిగా మాత్రమే వ్రాసి ఉండాలి. పైన ఇలా వ్రాయాలి - కలియుగీ గవ్వతుల్యమైన పతిత మనుష్యుల నుండి సత్యయుగీ వజ్రతుల్యమైన పావన దేవీ-దేవతలుగా అయ్యేందుకు ఈశ్వరీయ ఆహ్వానము. ఈ విధముగా వ్రాయడం ద్వారా మనుష్యులు అర్థం చేసుకునేందుకు సంతోషముగా వస్తారు. సద్గతిదాత అయిన తండ్రి యొక్క శివ జయంతియే జరపడం జరుగుతుంది. పూర్తిగా స్పష్టమైన పదాలు ఉండాలి. మనుష్యులు భక్తి మార్గములో ఎన్ని లెక్కలేనన్ని శాస్త్రాలు చదువుతారు. కష్టపడతారు. ఇక్కడ ఒక్క క్షణములో అనంతమైన తండ్రి నుండి ముక్తి-జీవన్ముక్తి లభిస్తాయి. ఎప్పుడైతే తండ్రికి చెందినవారిగా అయి వారి నుండి జ్ఞానాన్ని తీసుకుంటారో అప్పుడు జీవన్ముక్తి తప్పకుండా లభిస్తుంది. మొదట ముక్తిలోకి వెళ్ళి, ఆ తర్వాత ఎటువంటి పురుషార్థము చేసి ఉంటే ఆ విధముగా జీవన్ముక్తిలోకి తప్పకుండా వస్తారు. జీవన్ముక్తి అయితే తప్పకుండా లభిస్తుంది, కాకపోతే మొదటిలోనైనా రావచ్చు లేక చివరిలోనైనా రావచ్చు. మొదట జీవన్ముక్తిలోకి వస్తారు, ఆ తర్వాత జీవన బంధనములోకి. ఇటువంటి ముఖ్యమైన పాయింట్లను ధారణ చేసినా ఎంతో సేవను చేయగలుగుతారు. మీకు తండ్రి గురించి తెలిసినట్లయితే మరి ఇతరులకు కూడా పరిచయమును ఇవ్వండి. ఎవరికైనా పరిచయమును ఇవ్వడం

లేదంటే జ్ఞానం లేనట్లే. అర్థం చేయించడమైతే జరుగుతుంది కానీ వారి భాగ్యములో లేదు. కళ్యాణకారీ తండ్రి పిల్లలు అయితే కళ్యాణము చేయాలి. లేకపోతే తండ్రి అనుకుంటారు, వీరు మేము శివబాబా పిల్లలము అని కేవలం నామమాత్రముగా అంటున్నారు కానీ కళ్యాణము చేయడం లేదు. షావుకార్లు అయినా లేక పేదవారు అయినా, కళ్యాణమైతే అందరిదీ చేయాలి. కానీ మొట్టమొదట పేదవారే తీసుకుంటారు ఎందుకంటే వారికి తీరిక ఉంటుంది. డ్రామాలో ఈ విధముగానే నిశ్చితమై ఉంది. ఒకవేళ ఇప్పుడు ఒక షావుకారు వచ్చినట్లయితే అతని వెనుక అనేకమంది వస్తారు. ఇప్పుడు ఒకవేళ మహిమ వెలువడినట్లయితే లెక్కలేనంతమంది వచ్చేస్తారు.

మీది ఈశ్వరీయ పదవి. మీరు స్వయము మరియు ఇతరులు కళ్యాణమును కూడా చేస్తారు. ఎవరైతే స్వయము యొక్క కళ్యాణమునే చేసుకోరో, వారు ఇతరుల కళ్యాణమును కూడా చేయలేరు. తండ్రి కళ్యాణకారి, సర్వుల సద్గతిదాత. మీరు కూడా సహాయకులే కదా. అది భక్తి మార్గపు దశ అని మీకు తెలుసు. సద్గతి మార్గపు దశ ఒక్కటే. ఎవరైతే బాగా చదువుతారో మరియు చదివిస్తారో వారిపై బృహస్పతి దశ ఉంటుంది. వారిని మహారథులు అని అంటారు. మీ హృదయాన్ని ప్రశ్నించుకోండి - నేను మహారథినా? ఫలానా, ఫలానా వారిలా సేవ చేస్తున్నానా? పాదచారులు ఎప్పుడూ ఎవరికీ జ్ఞానాన్ని వినిపించలేరు. ఒకవేళ ఎవరి కళ్యాణమునూ చేయకపోతే తమను తాము కళ్యాణకారీ తండ్రి పిల్లలు అని ఎందుకు పిలిపించుకోవాలి? తండ్రి అయితే పురుషార్థము చేయిస్తారు. ఈ యజ్ఞ సేవలో ఎముకలను సైతం ఇవ్వాలి. అలా కాకుండా కేవలం తినడం, తాగడము, పడుకోవడము అంతే అదేమైనా సేవ అయినట్లా. అలా చేస్తే వెళ్ళి ప్రజలలో దాస-దాసీలుగా అవుతారు. తండ్రి అంటారు, పురుషార్థము చేసి నరుని నుండి నారాయణునిగా అవ్వండి. సుపుత్రులైన పిల్లలను చూసి తండ్రి కూడా సంతోషిస్తారు. లౌకిక తండ్రి కూడా, తన బిడ్డ చాలా మంచి పదవిని పొందనున్నాడని గమనిస్తే అతడిని చూసి సంతోషిస్తారు. పారలౌకిక తండ్రి కూడా అదే చెప్తున్నారు. అనంతమైన తండ్రి కూడా అంటున్నారు, నేను మిమ్మల్ని విశ్వానికి యజమానులుగా చేయడానికి వచ్చాను, ఇప్పుడు మీరు ఇతరులను కూడా ఆ విధముగా తయారుచేయండి. అంతేకానీ, కేవలం పొట్ట పూజ చేసినట్లయితే ఏం లాభముంటుంది? అందరికీ కేవలం - శివబాబాను స్మృతి చేయండి అనే చెప్పండి. భోజనం చేసేటప్పుడు కూడా ఒకరికొకరు తండ్రి స్మృతిని కలిగించండి, అప్పుడు అందరూ - వీరికి శివబాబా పట్ల ఎంతో ప్రీతి ఉంది అని అంటారు. ఇదైతే సహజమే కదా. ఇందులో నష్టమేముంది. అలవాటైపోతే ఒకవైపు తింటూ ఉంటారు, ఇంకొక వైపు బాబాను కూడా స్మృతి చేస్తూ ఉంటారు. దైవీ గుణాలను కూడా తప్పకుండా ధారణ చేయాలి. ఇప్పుడు అందరూ - ఓ పతిత పావనా రండి అని పిలుస్తున్నారు అంటే తప్పకుండా పతితులుగా ఉన్నట్లే. శంకరాచార్యులు కూడా శివుడిని స్మృతి చేస్తారు ఎందుకంటే వారే పతిత-పావనుడు. అర్ధకల్పం భక్తి చేస్తారు, ఆ తరవాత భగవంతుడు వస్తారు, ఎవరికీ ఈ లెక్క గురించి తెలియదు. తండ్రి అర్థం చేయిస్తారు - యజ్ఞ, తప, దానాదుల ద్వారా నేను లభించను, ఇందులో గీత కూడా వస్తుంది. ఈ శాస్త్రాలు మొదలైనవి చదవడం ద్వారా ఎవరి సద్గతి జరుగదు. గీత, వేదాలు, ఉపనిషత్తులు, ఇవన్నీ భక్తి మార్గానికి చెందినవి. తండ్రి అయితే పిల్లలకు సహజ రాజయోగాన్ని మరియు జ్ఞానాన్ని నేర్పిస్తారు. దాని ద్వారా రాజ్య ప్రాప్తిని కలిగిస్తారు. దీని పేరే రాజయోగము. ఇందులో పుస్తకాల విషయమేమీ లేదు. టీచర్ పదవిని ప్రాప్తింపజేసేందుకు చదివిస్తారు, కావున ఫాలో చెయ్యాలి. శివబాబాను స్మృతి చేయండి అని అందరికీ చెప్పండి. వారు ఆత్మలైన మనందరికీ తండ్రి. శివబాబాను స్మృతి చేయడం ద్వారా వికర్మలు వినాశనమవుతాయి. ఒకరినొకరు అప్రమత్తం చేసుకుంటూ ఉన్నతిని పొందాలి. ఎంతగా స్మృతి చేస్తారో, అంతగా అందులో స్వ కళ్యాణమే ఉంది. స్మృతి యాత్ర ద్వారా మొత్తం విశ్వమంతటినీ పవిత్రముగా తయారుచేస్తారు. స్మృతిలో ఉంటూ భోజనం తయారుచేసినట్లయితే అందులో కూడా శక్తి వచ్చేస్తుంది, అందుకే మీ బ్రహ్మా భోజనానికి ఎంతో మహిమ ఉంది. ఆ భక్తులు నైవేద్యం పెట్టేటప్పుడు కూడా రామ-రామ అని అంటూ ఉంటారు. రామనామాన్ని దానం చేస్తారు. మీకైతే బుద్ధిలో ఘడియ, ఘడియ తండ్రి స్మృతి ఉండాలి. బుద్ధిలో రోజంతా జ్ఞానము ఉండాలి. తండ్రి వద్ద మొత్తం రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానం ఉంది కదా. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు, మీరు వారిని స్మృతి చేసినట్లయితే ఉన్నత పదవిని ప్రాప్తి చేసుకుంటారు. ఇక ఆ తర్వాత ఇంకెవరినైనా స్మృతి చేయవలసిన అవసరమేముంది. తండ్రి అంటారు, కేవలం నన్నే స్మృతి చేయండి, కావున మిగిలినవారందరినీ వదలవలసి ఉంటుంది. ఇది అవ్యభిచారీ స్మృతి. ఒకవేళ స్మృతి కలగడం లేదంటే గుర్తుగా ముడి వేసుకోండి. మీ ఉన్నతి కొరకు, ఉన్నత పదవిని పొందేందుకు పురుషార్థము తప్పకుండా చేయాలి. మనల్ని కూడా టీచర్ గా తయారుచేసే శివబాబా మన టీచర్. మీరందరూ మార్గదర్శకులు కదా. మార్గదర్శకుల పని దారిని చూపించడము. ఇంతటి జ్ఞానము ఇంతకుముందు ఏమైనా మీలో ఉండేదా. మొదటైతే పైసకు విలువచేసే చదువు ఉండేది అని అందరూ అంటారు. అది తప్పకుండా ఉంటుంది. డ్రామానుసారంగా కల్పపూర్వము వలె చదువుతూ ఉంటారు. మళ్ళీ కల్పం తర్వాత కూడా ఇదే విధముగా చదువుతారు. చివరిలో మీకు అన్నీ సాక్షాత్కారమవుతాయి. సాక్షాత్కారమవ్వడానికి పెద్ద సమయం పట్టదు. బాబాకు

త్వరత్వరగా సాక్షాత్కారాలు జరుగుతూ వచ్చాయి. ఫలానా, ఫలానా వారు రాజుగా అవుతారు, ఈ వస్త్రాలను ధరిస్తారు, ఇలా ప్రారంభములో పిల్లలకు ఎన్నో సాక్షాత్కారాల జరిగేవి, మళ్ళీ అంతిమంలో ఎన్నో జరుగుతాయి, అప్పుడు గుర్తు చేసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. భోజనము చేసే సమయంలో పరస్పరం ఒకరికొకరు తండ్రి స్మృతిని కలిగించుకోండి, స్మృతిలో భోజనము చేయండి. ఒక్క శివబాబాతోనే సత్యమైన ప్రీతిని ఉంచండి.

2. యజ్ఞ సేవలో ఎముకలను ఇవ్వాలి. తండ్రికి పూర్తి సహాయకులుగా అవ్వాలి.

వరదానము:- అవినాశీ ప్రాప్తి ఆధారముగా సదా సంపన్నతను అనుభవం చేసే ప్రసన్నచిత్త భవ

సంగమయుగములో డైరెక్టుగా పరమాత్మ ప్రాప్తి లభిస్తుంది, వర్తమానం ముందు భవిష్యత్తు అసలేమీ కాదు, అందుకే మీ పాట ఉంది - పొందాల్సిందేదో పొందేసాను... బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అనే వస్తువేదీ లేదు అన్నది ఈ సమయానికి సంబంధించిన గాయనమే. ఇవి అవినాశీ ప్రాప్తులు. ఈ ప్రాప్తులతో సంపన్నంగా ఉన్నట్లయితే నడవడిక మరియు ముఖము ద్వారా సదా ప్రసన్నత యొక్క విశేషత కనిపిస్తుంది. ఏదేమైనా కానీ సర్వ ప్రాప్తులు కలిగినవారు తమ ప్రసన్నతను విడిచిపెట్టలేరు.

స్లోగన్:- పరమాత్మ ప్రేమ యొక్క అనుభవజ్ఞులుగా అయినట్లయితే ఏ ఆటంకము ఆపలేదు.

అవ్యక్త సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

ఎవరైనా మీ సమీప సంపర్కములోకి వస్తే - వీరు ఆత్మికమైనవారు, అలౌకికమైనవారు అని వారు అనుభూతి చెయ్యాలి. మీ పూర్వజతనము యొక్క స్మృతి ద్వారా ఆత్మలందరి పాలనను శాంతి శక్తితో చెయ్యండి. మీ బాధ్యత ఏమిటంటే - అశాంతి వాయుమండలములో ఆత్మలకు శాంతి దానాన్ని ఇచ్చి వారిలో శాంతి మరియు సహనశక్తు యొక్క ధైర్యాన్ని నింపడము. ఇందుకొరకు మీ వృత్తి ద్వారా, మనసా శక్తి ద్వారా విశేష సేవను చెయ్యండి. లైట్ హౌస్గా అయ్యి సర్వులకు శాంతి అనే లైట్ను ఇవ్వండి.

గోప-గోపికలందరికీ మాతేశ్వరి తమ స్వహస్తాలతో వ్రాసిన స్మృతి పత్రము **(1961)**

గోప-గోపికలందరికీ అతి ప్రియ స్మృతులు.

తర్వాత సమాచారం ఏమనగా మీరందరూ గృహస్థ వ్యవహారములలో ఉంటూ, కమల పుష్ప సమానంగా మీ జీవితంలో సఫలతను పొందుతూ ఉన్నారు కదా. ప్రియమైన గోపులు ఇప్పుడు సేవను మంచిగా పైకెత్తే పురుషార్థంలో నిమగ్నమై ఉన్నారు, చాలా మంచిది. చివరికి మన పరమ పూజ్యులైన తండ్రి యొక్క పరిచయము అందరికీ లభించవలసిందే. ఈ ఉన్నతమైన ప్రాప్తిని కోట్లలో కొందరే పొందగలరని మీకు తెలుసు, కానీ ఇటువంటి పుష్పాలైతే తప్పకుండా వెలువడతాయి కదా! అచ్ఛా, తీవ్ర వేగంతో సేవను పెంచుతూ వెళ్ళండి. అవినాశీ జ్ఞాన ధనము యొక్క ఖజానా అయితే ఎంతో అద్భుతమైనది, తరగనిది, ఈ ఖజానా తండ్రి ద్వారా పిల్లలందరికీ లభిస్తూనే ఉంటుంది. ఎవరైనా దీనిని పొందినట్లయితే జన్మజన్మాంతరాల కొరకు సుసంపన్నంగా అయిపోతారు, అసలు ఈ వస్తువే అటువంటిది. ప్రియమైన గోప-గోపికల్లారా చెప్పండి, ఇది నిజమే కదా!

ఇప్పుడు గోప-గోపికలందరూ అతీంద్రియ సుఖమయమైన జీవితపు అనుభవము ద్వారా జీవితాన్ని గడుపుతూ వెళ్ళండి. చూడండి, ప్రియమైన గోప-గోపికల్లారా, ఇప్పుడు ఈ బ్రాహ్మణ కులము వృద్ధి చెందడములోనే అందరి కళ్యాణము ఉంది, ఆ తర్వాత బ్రాహ్మణుల నుండి దేవతలుగా తప్పకుండా అవుతారు. కొందరు తమ గృహస్థ

వ్యవహారంలో ఉంటూ కూడా బ్రాహ్మణ కుల వంశీయులుగా అయి నడుస్తున్నారు, అనగా గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉంటున్నారు. మేము ఒక్క తండ్రి పిల్లలము అని అనుకుంటూ ఇటువంటి పవిత్ర ధారణలో ఉంటున్నారు. ఇకపోతే అందరూ పరమపిత అయిన ఆ తండ్రి డైరెక్షన్ల అనుసారంగానే నడుచుకోవాలి, దీనినే శ్రీమతంపై నడవడము అని అంటారు. ఇటువంటి ధారణలలో నడిచేవారినే బ్రాహ్మణ కుల వంశీయులు అని అంటారు. ఇప్పుడు ఆ తండ్రే తండ్రిగా, టీచరుగా, సద్గురువుగా అయ్యారు, అలాగే వారు ధర్మరాజు కూడా, మరి మనం వారి దత్తత తీసుకోబడిన సంతానంగా అయ్యి మన పూర్తి పవిత్రత యొక్క అధికారమును ఎందుకు తీసుకోకూడదు. దీని ద్వారానే భవిష్యత్తులో సుఖశాంతుల యొక్క పూర్తి అధికారము ప్రారబ్ధము రూపంలో ప్రాప్తిస్తుంది.

మరి చెప్పండి, ప్రియమైన గోప-గోపికల్లారా, ఇటువంటి సహజమైన రహస్యాన్ని అర్థం చేసుకున్నారు కదా! జీవిస్తూనే మరణించడం లేక మరజీవాగా అవ్వడములో భయపడడం లేదు కదా! ఈ రోజు ఈ పత్రమును ప్రతి ఒక్కరూ తమ పేరు మీద వ్యక్తిగతముగా వ్రాసినదిగా భావించి మీకే పంపిన పత్రముగా భావించి చదవండి లేక వినండి మరియు ఈ తల్లి ప్రేమను కూడా ప్రతి ఒక్కరు తమ పేరు పేరునా పొందండి. గోప-గోపికలు ప్రతి ఒక్కరిపై పేరు పేరునా ఈ తల్లికి అత్యంత ప్రేమ ఉంది. అచ్ఛా, మీ సౌభాగ్యమును ఉన్నతముగా తయారుచేసుకునే పురుషార్థంలో తీవ్ర వేగముతో నిమగ్నమై ఉండడమే కళ్యాణకారిగా అవ్వడము. స్వయంగా పరమపిత ఉన్నతమైన వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు అని ఇప్పుడు తెలిసాక ఇక దానిని తీసుకునే తీరాలి. అచ్ఛా, మరి సెలవు. ఓం శాంతి.